ఎమ్మెల్సీ పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

పలమనేరు: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల నియోజకవర్గానికి సంబంధించిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. పలమనేరు రెవెన్యూ డివిజన్‌లోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల కేంద్రంలో మౌలిక సదుపాయాలను గమనించారు. ముఖ్యంగా కరెంట్, మంచినీరు, టాయ్‌లెట్లపై దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అనంతరం పట్టణ సమీపంలోని ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కళాశాల కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి తాత్కాలిక స్ట్రాంగ్‌రూమ్ ఏర్పాటుపై సూచనలిచ్చారు. రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల స్థలాలను పరిశీలించారు. ఆయన వెంట పలమనేరు ఆర్‌డీవో శివయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



పలమనేరు బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు , కుప్పం: సూచనలిస్తున్న జేసీ

పోలింగ్ కేంద్రాల్లో వసతులు

వి.కోట: పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన వసతులు కల్పించి, ఓటర్లకు ఎటువంటి ఇబ్బందు లేకుండా అన్ని ఏర్పాట్లు ఉండాలని జాయింట్ కలెక్టర్ వెంకటేష్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో అవసరయ్యే మౌలిక వసతుల కల్పనలు ఏర్పాటు చేయాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మండల అధికారులకు ఆదేశించారు. తహసీల్దార్ కుమార్‌స్వామి, మండల అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. మండలంలో 1043 మంది పట్టభద్రులు, 55 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. ఆర్డీఓ శివయ్య, తహశీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ పాల్గొన్నారు.

పకడ్బందీగా పోలింగ్

పుంగనూరు: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన స్థానిక బసవరాజ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆర్డీవో శివయ్యకు పలు సూచనలు చేశారు. తహశీల్దార్ సీతారామన్, ఎంపీడీవో రాజేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

8 లోపు ఓటర్ స్లిప్‌ల పంపిణీ

కుప్పం: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పగడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం కుప్పం, రామకుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండలాల్లోని 13 పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. వీటిలో 8 గ్రాడ్యుయేట్, 5 టీచర్ స్థానం ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 8వ తేదీ లోపు ఓటర్లుకు స్లిప్‌లను అందజేయాలన్నారు. ఎన్నివిధులను నిర్లక్ష్యంగా నిర్వహించాలని సూచించారు. ఆర్‌డీఓ శివయ్య, మున్సిపల్ కమిషనర్ రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

పెద్దపంజాణి: స్థానిక ఉన్నత పాఠశాల కేంద్రంలో ఏర్పాటు చేసి రెండు పోలింగ్ బూత్‌లను జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయి వసతులు ఏర్పాటు చేశామని తహసీల్దార్ హనుమంతు వివరించారు. పలమనేరు ఆర్‌డీఓ శివయ్య, ఎంపీడీఓ శ్రీనివాస విశ్వనాథ, ఎంఈఓ హేమలత పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

శాంతిపురం: మండల కేంద్రలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ శుక్రవారం పరిశీలించారు. పట్టభద్రుల ఓటింగ్ కోసం సిద్ధం చేయనున్న రెండు, ఉపాధ్యాయ స్థానం ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఒక గదిని ఆయన తనిఖీ చేశారు. ఎంపీడీఓ హేమమాలిని, తహసీల్దార్ లోకేశ్వరరావుకు సూచనలు చేశారు.

క్లుప్తంగా

నేడు సదుం మండల మీట్

సదుం: మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వరప్రసాద్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని తెలిపారు.

140 మందికి వైద్య పరీక్షలు


పరీక్షలు చేస్తున్న డాక్టర్ మౌర్యకుమార్ రెడ్డి

రొంపిచెర్ల: పెద్దగొట్టిగల్లుకు చెందిన మేకల జయరామిరెడ్డి, అమ్మణెమ్మ జ్ఞాపకార్థం శివాలయం ఎదురుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వివిధ రకాల వ్యాధిగ్రస్తులు140 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. డాక్టర్లు భార్గవ, దేవులపల్లె మౌర్యకుమార్ రెడ్డి, భానుప్రకాష్, దినేష్‌రెడ్డి, సర్పంచ్ సుష్మా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు

పలమనేరు: పట్టణ సమీపంలోని గంగవరం పోలీసుస్టేషన్ ఎదుట ఈనెల ఐదో తేదీ పట్టభద్రులు, టీచర్ల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఓటర్లతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొననున్నారని పేర్కొన్నారు.

శ్రీవారి పాద క్షేత్రానికి నూతన విగ్రహాలు



సదుం: మండంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రానికి భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలు చేరినట్లు శుక్రవారం ఆలయ నిర్వాహకులు తెలిపారు. నూతన విగ్రహాలను తిరుమల తిరుపతి దేవస్థానం సమకూర్చినట్టు చెప్పారు. ఈసందర్భంగా విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. టీటీడీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

పొర్లుదండాల మొక్కు చెల్లింపు



గంగవరం: మండల కేంద్రంలో ఇరుముడులు ధరించిన ఓం శక్తి భక్తులు కొంతమంది శుక్రవారం పొర్లు దండాలతో అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. తమిళనాడు రాష్ట్రం మేల్‌మరత్తూరు ఓంశక్తి అమ్మవారి భక్తుడుగా పిలువబడే (అడిగలార్) జన్మదినం సందర్భంగా అమ్మవారి ఆలయం వరకూ పొర్లుదండాల వెళ్లారు. ఉదయం నుండి ఉపవాసం ఉండి నియమ నిష్టలతో ఇళ్ల నుంచి పొర్లు దండాలతో కూర్నిపల్లి రోడ్డు వద్ద వెలసి ఉన్న ఓంశక్తి అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పూజలు అనంతరం దీక్షను విరమించారు.

పక్కాగా నియమావళి అమలు

పెద్దపంజాణి: మండలంలో ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ టీ.శ్రీనివాస్ విశ్వనాథ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తానుఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్లు వీరప్పల్లి ఎంపీటీసీ సభ్యుడు జిల్లా కలెక్టర్‌కు, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం అవాస్తవమన్నారు. ఎన్నికల కోడ్ తానెక్కడా ఉల్లఘించలేదన్నారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ పథకాలు అమలుపై ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదిపేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నడుచుకుంటున్నామని తెలిపారు. పార్టీలకతీతంగా ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తె లియజేశారు.

తల్లి,బిడ్డ ఆరోగ్యం కోసమే ..



పుంగనూరు: తల్లి,బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద పోషక ఆహారాలను అందిస్తున్నట్లు కౌన్సిలర్ పద్మావతి అన్నారు. శుక్రవారం కట్టకింద పాళ్యెం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు పోషణ కిట్లను పంపిణీ చేశారు. కౌన్సిలర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం ఆదుకోంటోందన్నారు. అంగన్‌వాడీలలో మధ్యాహ్న భోజనం, ప్రీప్రైమరీ స్కూల్‌గా ఏర్పాటు, గర్భిణులకు, బాలింతలకు పోషక ఆహార పదార్థాలు అందిస్తున్నట్లు తెలిపారు.

తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

పుంగనూరు: మండలంలో ఏ ప్రాంతంలో కూడ తాగునీటి సమస్య తెలత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల సమావేశాన్ని ఎంపీడీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు అంశాలపై చర్చించి, అజెండాను ఆమోదించారు. ఎంపీపీ మాట్లాడుతూ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా బోర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపు లైన్లు వేయిస్తున్నటుట్ల తెలిపారు. ఎంపీ నిధులతో 24 ఆర్‌వోఆర్ ప్లాంట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాగునీటిపై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రత్యే


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పక్కన జెడ్పీటిసి జ్ఞానప్రసన్న

దృష్టి తీసుకోవాలని పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ నాగరాజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్ఞానప్రసన్న, తహసీల్దార్ సీతారామన్, వైస్ ఎంపీపీ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- రూ.4లక్షల ఆస్తి నష్టం

శాంతిపురం: కెనమాకులపల్లె పంచాయతీ బోయన పల్లెలో మునివెంకటప్ప ఇంట్లో శుక్రవారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో భారీ ఆస్తినష్టం జరిగింది. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లోనే ఉండడంతో వస్తువులను బయటకు తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే ఇళ్లంతా విద్యుత్ సరఫరా కావడంతో భయంతో బయటకు వచ్చేశారు. స్థానికులు విద్యుత్ సరఫరా ఆపించి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేలోపు ఇంట్లోని వస్తువులు దాదాపు పూర్తిగా కాలిపోయాయి. చేపలు పట్టడానికి వినియోగించే 5 వలలతో పాటు కొంత నగదు బూడిద అయ్యింది. టీవీ, ఫ్రిడ్జ్ సహా ఇంట్లోని విద్యుత్ ఉపకరణాలు పాడయ్యాయి.


ప్రమాదంలో కాలిపోయిన ఫ్రిడ్జ్, వస్తువులు

దాదాపుగా రూ 4. లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్టు బాధితుడు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వీఆర్వో లోకేశ్వరి సంఘటన స్థలాన్ని పరిశీలించి నష్టంపై ప్రాథమిక నివేదికను తహసీల్దార్ లోకేశ్వరరావుకు అందించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

వి.కోట: మండలంలోని ఎస్ బండపల్లెలో నూతనంగా నిర్మించనున్న ఆలయ పనులకు శుక్రవారం జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు భూమి పూజ చేశారు. ఎంపీపీ యువరాజు, గ్రామస్తులతో కలిసి ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. అంతకు ముందు మండలంలోని పలు ఆలయాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు. మొదట పట్టణంలోని గంగమ్మ ఆలయంలో మంజులమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో జెడ్పీ చైర్మెన్ దంపతులు, ఎంపీపీ యువరాజు పాల్గొన్నారు. వైస్ ఎంపీపీ తమీమ్‌ఖాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంజుల, సతీష్, నాగరాజు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు దంపతులు

తాగునీటిపై ప్రత్యేక దృష్టి

సోమల: వేసవి సమీపిస్తున్న తరణంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారుల సమన్వయంతో ప్రజాప్రతినిధులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఈశ్వరయ్య తెలిపారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలను వినిపించారు. వైస్ ఎంపీపీ ప్రభాకర మాట్లాడుతూ మదనపల్లె నుంచి బోయకొండ మీదగా చౌడేపల్లెకు ఆర్టీసీ సర్వీసు నడుపుతున్నారని దానిని సోమల,సదుం మీదగా కల్లూరు వరకు పొడిగించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందజేయకుండా కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పిల్లల హాజరును నమోదు చేయడం లేదని, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎంసీ చైర్మన్ అరుణమ్మ, వైస్ ఎంపీపీ సయ్యద్‌బాషా, ఎంపీడీఓ నాగరాజ, తహసీల్దార్ శ్యాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ ఈశ్వరయ్య

పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదు

పులిచెర్ల(కల్లూరు): మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి నారాలోకేష్‌కు లేదని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం కల్లూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో భాగంగా శుక్రవారం కొత్తపేటలో బహిరంగసభలో అవాస్తవ ఆరోపణలు చేయడం తగదన్నారు. గత ఏబై సంవత్సరాలలో ఎవరూ చేయలేనంత అభివృద్ధి పుంగనూరు నియోజకవర్గంలో జరిగిందన్నారు. ప్రతి పల్లెకు సీసీ రోడ్లు, తారురోడ్లు, మంచినీటి సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించారని తెలిపారు. ఇవన్నీ కనబడలేదా, మూడు మెగా ప్రాజక్టులు, మూడు ఇరిగేషన్ ప్రాజక్టులు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మామిడి రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించింది మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డేనన్నారు. హెరిటేజ్ పాల ఉత్పత్తుల అమ్మకాల కోసమే మీ తండ్రి హయాంలో విజయ డైరీని మూయించారని ఆరోపించారు. పాలకు హెరిటేజ్ కంటే శివశక్తి డైయిరీలోనే అధిక ధర చెల్లిస్తున్నారని తెలిపారు. వీటన్నిటికిబహిరంగ చర్చకు వస్తావా


మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

అని సవాలు విసిరారు. గతంలో మంత్రి హోదాలో కల్లూరుకు విచ్చేసి నప్పుడు మసీదు అభివృద్ధికి రూ.18.0 లక్షలు ఇస్తానని కలెక్టరు ముందు రాత పూర్వకంగా ఇచ్చిన మాట ఇప్పటికీ లోకేష్ నెరవేర్చలేదన్నారు. కల్లూరులో మైనారిటీల సదస్సు నిర్వహిస్తానని ప్రకటించినా నిన్ను వారు నమ్మే పరిస్థితి లేదన్నారు. నాయకులు రెడ్డీశ్వరరెడ్డి, నాదముని రెడ్డి, ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, పోకలచంద్ర, నాగరాజ ప్రసాద్, దామోదర్, షుకూర్, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, సాకత్‌అలీ, రెడ్డి అహమ్మద్, నటరాజ, గోవిందరెడ్డి, గోవర్ధన్, కొదండ, ప్రసాద్, రమణ, సంతోష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న పీడీ నాగశైలజ

రొంపిచెర్ల: మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ శుక్రవారం తనిఖీ చేశారు. బండకిందపల్లె, కుమ్మరపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలు ఎంత మంది హాజరు అయ్యారని తెలుసుకున్నారు. విద్యా బోధన బాగా జరుగుతోందా అని పిల్లలను విచారించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం బండకిందపల్లె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మీ, భారతి, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గదిలో పాము

- కాటు నుంచి తప్పించుకున్న విద్యార్థిని

రామకుప్పం: స్థానిక బాలికల జెడ్పీ హైస్కూల్ గదిలో పాము కలకలం రేపింది. పాముకాటు నుంచి విద్యార్థి తప్పించుకుంది. 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని శౌర్యశ్రీ శుక్రవారం ఉదయం పాఠశాలలోని గదిలో చెత్త ఊడ్చేందుకు వెళ్లింది. అయితే పుస్తకాలు పక్కన పెట్టేందుకు ప్రయత్నించగా చేతికి పాము చిక్కింది. విద్యార్థిని గట్టిగా కేకలు వేస్తూ పామును బయటకు విసిరివేయడంతో కాటు నుంచి తప్పించుకుంది. పాఠశాలకు చేరుకున్న మరో విద్యార్థి తండ్రి బయట ఉన్న పామును చంపేయడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయులును వివరణ కోరగా.. పాఠశాలలో పనిచేస్తున్న స్వీపర్ అనారోగ్యం వల్ల శుక్రవారం విధులకు హాజరు కాలేదని తెలిపారు. ఇకపై కూడా విద్యార్థులు చెత్త తోయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచేలా చూస్తామని తెలిపారు.

పేర్నాటి గెలుపు..పట్టభద్రుల గెలుపు



శాంతిపురం : సొన్నేగానిపల్లెలో కరపత్రాల పంపిణీ, రొంపిచెర్ల : మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తం

శాంతిపురం: నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఓటర్లను కోరారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు శుక్రవారం సొన్నేగానిపల్లిలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణితో సహా నాయకులు జట్లుగా విడిపోయి పలు గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులైన ఓటర్లను కలిశారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపిస్తే ప్రతి పట్టుభద్రుడు గెలిచినట్టేనని చెప్పారు. యువత సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తిని చట్టసభకు పంపితే పట్టభద్రుల గొంతుక అవుతారని అన్నారు.

సదుం: వైఎస్సార్‌సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి విజయానికి సహకరించాలని ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి కోరారు. మండలంలో తిమ్మానాయనపల్లెలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 18 పంచాయతీల పరిధిలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రచారం చేపట్టారు. సచివాలయ మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సర్పంచ్ మురళీరెడ్డి, రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు మంగమ్మ, నాయకులు పుత్రాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల: తూర్పు రాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిని మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మండలంలో అధిక శాతం ఓట్లు వేసి గెలిపించాలని అన్నారు. నాయకులు ఆర్.ఇబ్రహీం ఖాన్, కరీముల్లా, సూర్య నారాయణరెడ్డి, యుగంధర్ రెడ్డి, విజయశేఖర్, భాస్కర్ రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.


చౌడేపల్లె: సూచనలిస్తున్న పరిశీలకుడు జింకా వెంకటా చలపతి, పక్కన పెద్దిరెడ్డి

చౌడేపల్లె: శ్యాంప్రసాద్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేలా నాయకులు పని చేయాలని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి సూచించారు. శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నేతలు, సచివాలయ కోఆర్డినేటర్లతో సమావేశం జరిగింది. ఓటర్లను కలిసి 1వ ప్రాధాన్యత ఓటు వేయాలని కోరాలని తెలిపారు. సచివాలయ మండల కన్వీనర్ రుక్మిణమ్మ, మాజీ ఎంపీపీలు అంజిబాబు, రెడ్డిప్రకాష్, యువ కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు కిషోర్‌బాబు, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, కల్యాణ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సాధిక్‌బాషా, సర్పంచ్ వరుణ్ ఎంపీటీసీ సభ్యురాలు రూపారేఖ పాల్గొన్నారు.

దాసుడిపై దాశరథి


హనుమంత వాహనంపై కోదండరామస్వామి

శాంతిపురం: రాళ్లబూదుగూరులోని శ్రీకోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి తనకు ఎంతో ఇష్టమైన హనుమంతుడిని వాహనంగా చేసుకుని పురవీధుల్లో ఊరేగారు. కొండతిమ్మనపల్లి గ్రామస్తులు ఉబయదారులుగా వాహన సేవను నిర్వహించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. శనివారంరాత్రి స్వామి వారి శేషవాహన సేవ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

పాఠశాల తనిఖీ



సోమల: మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్ అమాస మోహన్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడురమణయ్య, వైఎస్సార్‌సీపీ యూత్ నేత ఆటో ప్రసాద్, హెచ్‌ఎం ఎల్లయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోనే ఎస్సీల అభ్యున్నతి

సదుం: ఎస్సీల అభ్యున్నతికి సీఎంతో పాటు మంత్రి చూపుతున్న చొరవ మరువలేనిదని వారు దళిత సంఘం నాయకులు తెలిపారు. మండల కేంద్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రపటాలకు దళిత సంఘం నాయకులు శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పలు పదవులను ఎస్సీలకు కేటాయించడం అభినందనీయమని చెప్పారు. అంబేడ్కర్ భవన నిర్మా ణానికి త్వరలో రూ.50 లక్షల నిధులు మంజూరు కానున్నట్లు చెప్పారు. ఈసందర్భంగా కొత్తగా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన వెంకటస్వామి, ఎంపీపీ ఎల్లప్ప, అంబేడ్కర్ యువజన సంఘం గౌరవాధ్యక్షుడు సీతాపతిని సన్మానించారు. కార్యక్రమంలో హరిబాబు, గిరిబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సదుం: సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న దళిత సంఘం నాయకులు

శాస్త్రోక్తంగా రాహుకాల అభిషేక పూజలు



ప్రత్యేకాలంకారంలో అమ్మవారు, ఆలయంలో భక్తుల రద్దీ

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల అభిషేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువ జామున ఆలయంలో శుద్ధి కార్యక్రమాలు జరిగాయి. మామిడి, పరిమళ భరిత పుష్ప తోరణాలతో ముస్తాబు చేశారు. ఉదయం 10-30 నుంచి 12 గంటల వరకు రాహుకాల సమయం అభిషేక పూజల అనంతరం అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో ముస్తాబుచేసి దర్శన భాగ్యం కల్పించారు. కోర్కెలు తీరిన భక్తులు మొక్కుబడులు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌ ళి పర్యవేక్షణలో పవిత్ర తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం

పలమనేరు: వన్యప్రాణులను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని మండిపేటకొటూరు సైన్సు ఉపాధ్యాయురాలు ఉష పేర్కొన్నారు. మండిపేటకొటూరు హైస్కూల్‌లో శుక్రవారం అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులను రక్షిస్తే వన్యప్రాణులను కాపాడుకున్నట్టేనని సూచించారు. అడవులకు నిప్పు పెట్టడం, వన్యప్రాణులను వేటాడడం నేరమని తెలిపారు. ఎఫ్ఎస్వో రమేష్, ఎఫ్‌బీవోలు శ్రీనివాసులు, హైమవతి, ప్రేమలత. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.


పలమనేరు: మాట్లాడుతున్న సైన్స్ టీచర్ ఉష

భారీ మెజారిటీ లక్ష్యం కావాలి


సోమల : నేతలకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

సోమల: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటీ శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. శుక్రవారం సచివాలయాల మండల కన్వీనర్ రాశెట్టి మధు అధ్యక్షతన స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయ సమీపంలో మండలంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తక్కువ సమయం ఉందని, పంచాయతీల వారీగా ఓటర్లను గుర్తించి ప్రచారం ముమ్మరం చేయాలని సూచించారు.

కష్టపడి పనిచేయాలి

పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు పేర్నాటీ శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డికి సోమల మండలంలో అత్యధిక మెజారిటీ వచ్చేలా కష్టపడి పని చేయాలని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం తంబళ్లపల్లెకు వెళు తూ సోమలలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరా వు, ఎంపీపీ ఈశ్వరయ్య, వైస్ ఎంపీపీలు ప్రభాకర, సయ్యద్‌బాషా, జిల్లా కార్యదర్శులు శీలం భాస్కర్, సరస్వతమ్మ, నేతలు సాంబయ్య, వరదం రమణ, నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మోహిని ఉత్సవంలో శ్రీనివాసుడు


భక్తులను కటాక్షిస్తున్న శ్రీవారు

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద గల శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామిని ఉదయం మోహిని ఉత్సవంపై ఊరేగించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆరో రోజు శనివారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం శ్రీవారి గరుడసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

చిన్నారులకు టీకా తప్పనిసరి

సదుం: మండలంలోని చెరుకువారిపల్లె, గొంగివారిపల్లెలో జరుగుతున్న టీకా కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న టీకా వివరాలను ఆరా తీశారు. ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ఉదయభాస్కర్, నీలకంఠ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కుప్పం: కుప్పం, గుడపల్లె మండలాల్లోని మహాత్మ జ్యోతీబాపులే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సరోజా తెలిపారు. ఈ నెల 5వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె కోరారు. పాఠశాలలో 40 సీట్లు ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థిలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచితంగా దంత పరీక్షలు


దంతాలను పరీక్షిస్తున్న వైద్యురాలు భవ్య

కుప్పం/కుప్పంరూరల్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో 150 మంది విద్యార్థులకు కేసీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచితంగా దంప పరీక్షలు నిర్వహించారు. శనివారం ఉదయం వైద్యులు డా.భవ్య విద్యార్థుల పళ్లను పరీక్షించారు. ఈ సందర్భంగా వైద్యులు కేసీ ఆస్పత్రి అధినేత మంజునాథ్ మాట్లాడుతూ 150 మంది విద్యార్థులకు ఉచితంగా డెంటల్ కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా చిన్నతనంలో దంత సమస్యలు ఎక్కువగా వస్తాయని, వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జనార్దన్ రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీకి రూ.32 లక్షల ఆదాయం

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని దినసరి మార్కెట్, వారపుసంత, చేపల చెరువులకు సంబంధించి మున్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన బహిరంగ వేలంపాట ద్వారా మున్సిపాలిటీకి రూ.32.16 లక్షల ఆదాయం దక్కినట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ వేలంపాటలో హెచ్చు ధర పాడి న వారికి ఏడాదికి సంబంధించిన హక్కులు దక్కాయన్నారు. అయితే ముందస్తుగా వేలంపాటపై సమాచారం ఇవ్వకపోవడంతో మున్సిపాలిటీకి నష్టం వచ్చిందనే మాట పట్టణంలో సర్వత్రా వినిపిస్తోంది. వేలం పాటను మీడియాకు సైతం తెలియకుండా నిర్వహించడం గమనార్హం.

అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

చౌడేపల్లి: ప్రమాణాలకు నిలయమైన రాజనాల బండ, కరణంవారిపల్లె సమీపంలో గల అభయాంజనేయ స్వామి ఆలయం, చౌడేపల్లెలోని ఆంజనేయ స్వామి ఆలయం, గాండ్లపల్లె వద్ద ఉన్న ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

సారా విక్రేత అరెస్ట్

సోమల: సారా విక్రేతను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని గురుకానివారిపల్లెలో సారా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో శనివారం తనిఖీలు చేశామన్నారు. ఎద్దలవానికుంట వద్ద సారా అమ్ముతున్న హరినాథ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 50 ప్యాకెట్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమ్మిత్తం పుంగనూరు కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

చౌడేపల్లి: మండలంలోని బోయకొండ యానాదిపాళ్యంకు చెందిన బాలాజి భార్య యర్రమ్మ(32) శనివారం రాత్రి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

‘పెద్దిరెడ్డి పేరెత్తే అర్హత నీకు లేదు’



పుంగనూరు: మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పక్కన పెద్దిరెడ్డి, వెంకటాచలపతి, పులిచెర్ల: మాట్లాడుతున్న మురళీధర్, సురేంద్రనాథరెడ్డి

- ముందు మీతాత ఎన్టీఆర్ గురించి చెప్పు
- ఆయన చావుకు మీతండ్రి చంద్రబాబు కారణం కాదా లోకేష్ ?
- మండిపడిన వైఎస్సార్‌సీపీ నేతలు

పుంగనూరు: ప్రజలను మోసగించేందుకు లోకేష్ తాత కథ చెప్పడం కాదని, ముందు మీ తాత ఎన్టీఆర్‌కు మీ తండ్రి చంద్రబాబు చేసిన ద్రోహం, ఆయన మరణానికి కారణమెవరో చెప్పాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై యువగళం పాదయాత్రలో నారా లోకేష్ చేసిన విమర్శలపై ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ జింకా వెంకటాచలపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్టీఆర్ కుటుంబాన్ని నామరూపాలు లేకుండా చేసేందుకు చంద్రబాబు చేసిన కుట్రల గురించి తెలపాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో పుంగనూరు నియోజకవర్గానికి నూరుకోట్లు ఇచ్చామని అబద్ధాలు చెప్పడం సిగ్గు చేటన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో వందల కోట్ల రూపాయలతో పుంగనూరులో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. మీ తండ్రి చంద్రబాబునాయుడు విజయ డెయిరీని మూసి హెరిటేజ్‌ను అభివృద్ధి చేసుకుని వందలకోట్లు సంపాదించలేదా?


మాట్లాడుతున్న పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్‌భరత్

? అని ప్రశ్నించారు. మంత్రి పెద్దిరెడ్డి నిజాయితీని చూసే ప్రజలు ఆయనను పెద్దాయనగా పిలుస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో సచివాలయాల కన్వీనర్ కొత్తపల్లె చెంగారెడ్డి, నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, దేశిదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, శంకరప్ప, రమణ, సుబ్రమణ్యం, రాజశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి కనబడదం లేదా.. !

పులిచెర్ల(కల్లూరు): మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో ఏస్థాయిలో అభివృద్ధి చేశాడో కళ్లకు కనిపించ లేదా లోకేష్ అని రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్, జెడ్పీటీసీ మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. కల్లూరులో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పులిచెర్ల మండలంలోని అన్ని పల్లెలకు సీసీరోడ్లు, తాగునీరు, తారురోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసిన ఘనత మంత్రి పెద్దిరెడ్డిదే అన్నారు. కల్లూరు మసీదుకు తాను మంత్రిగా ఉన్నప్పుడు నిధులు కేటాయిస్తూ జీఓ ఇచ్చానని చెబుతున్న లోకేష్, కనీసం ఆ జీఓ కాపీ చూపించాలని, అందుకు తాము దేనికైనా సిద్ధమన్నారు. మండలంలో మసీదులకు రంజాన్ సమయంలో తన సొంత నిధులిచ్చిన ఘనత మంత్రి పెద్దిరెడ్డిదే అన్నారు. షాదీ మహల్, షాదీఖానాల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి మైనారిటీలను అభివృద్ధికి కృషి చేసారన్నారు. ఈరోజు మీ పాదయాత్రలో మీ వెంట వచ్చిన వారిని చూస్తేనే తెలుస్తోంది మీకు వారి పట్ల నమ్మకం ఎంత ఉందో అని ఆరోపించారు. నాయకులు నాదమునిరెడ్డి, ముర్వత్‌బాషా, నరసింహులుశెట్టి, షుకూర్, రెడ్డిఅహమ్మద్, చంద్రశేఖరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, గోవిందరెడ్డి, దామోదర్, మునీశ్వర, కొండా మురళి, సౌకత్‌అలీ, సాజిద్, రమణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దిరెడ్డిని విమర్శించే అర్హత లోకేష్‌కు లేదు..

చౌడేపల్లి: పుంగనూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత లోకేష్‌కు లేదని ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కల్యాణ్‌భరత్ అన్నారు. శనివారం చౌడేపల్లెలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోకేష్ తన పాదయాత్రలో మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై ఆరోపణలు చేస్తే సహించమన్నారు. ముప్పై ఏళ్లలో జరగాల్సిన అభివృద్ధి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో సర్వతోముఖాభివృద్ధి జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. ఎంపీటీసీ శ్రీరాములు, సోషల్ మీడియా కోర్డినేటర్ జయచంద్ర, చంద్ర, యుగంధర్, చరణ్, ఇర్ఫాన్ ఉన్నారు.

గృహ నిర్మాణాల పూర్తిపై సమీక్ష


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

సోమల: రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగరాజ సూచించారు. శనివారం మండలంలోని ఇరికిపెంట పంచాయతీలోని జగనన్న కాలనీలను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నా ఎందుకు నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయో చెప్పాలని ప్రశ్నించారు. నిర్మాణాల పురోగతిపై ఇంజినీరింగ్ అసిస్టెంట్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సచివాలయంలో తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వేముల హరినాథ్, పంచాయతీ కార్యదర్శి మేనక పాల్గొన్నారు.

‘సహకార బంధు’ను సద్వినియోగం చేసుకోండి

బైరెడ్డిపల్లె: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన ‘సహకార బంధు’ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బైరెడ్డిపల్లె బ్రాంచ్ మేనేజర్ సుబ్రమణ్యం తెలిపారు. సహకార బంధు రీఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ డిపాజిట్‌పై 7.70 శాతం, సీనియర్ సిటిజన్స్‌కు 8.54 శాతం వడ్డీ వర్తిస్తుందన్నారు. కనిష్ఠ డిపాజిట్ రూ.1000కి పైబడి సేకరిస్తారన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు 0.75 శాతం అదనపు వడ్డీ అందుతుందన్నారు. డిపాజిట్లకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ రక్షణగా ఉంటుందన్నారు. ఈనెల 20వ తేదీలోపు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శేష వాహనంపై శ్రీరామచంద్రుడు


శేష వాహనంపై దర్శనమిస్తున్న సీతాలక్ష్మణ సమేత కోదండరాముడు

శాంతిపురం: రాళ్లబూదుగూరులోని పురాతన శ్రీకోదండరామస్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఐదవ రోజైన శనివారం సీతాలక్ష్మణ సమేతుడైన కోదండరాముడు ప్రత్యేక అలంకరణలో శేషవాహనం పైనుంచి భక్తులను కనువిందు చేశాడు. స్వామివారి ఉత్సవ మూర్తులకు భక్తులు ఇంటింటా పూజలు నిర్వహించారు. రాళ్లబూదుగూరుకు చెందిన ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శేష వాహన సేవ, అన్నదానం చేపట్టారు. ఆదివారం స్వామివారికి మోహిని తిరుకోలు సేవ, సీతారాముల కల్యాణం, గరుడవాహనంపై విహారం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

బాటగంగమ్మకు ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని బాట గంగమ్మ ఆలయంలో శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

వైభవంగా గంధం మెరవణి


గంధం మెరవణిలో పాల్గొన్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె మండల పరిషత్ సమీపంలో ఉన్న హజరత్ బిస్మిల్లా షాఖాదరి వారి 58వ ఉరుసు మహోత్సవంలో భాగంగా శుక్రవారం రాత్రి గంధం మెరవణి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తాజియాను, కొల్లాం పకీర్ల జోహార్లను రంగురంగుల పుష్పాలతో అలంకరించిన వాహనంలో గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. ముస్లింలతో పాటు హిందువులు కూడా మొక్కులు తీర్చుకున్నారు. యువకులు ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు.

ఉద్యమ అభ్యర్థులను గెలిపించండి

పలమనేరు: ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల్లో ఉద్యమ అభ్యర్థులు ఎం.వెంకటేశ్వర్ రెడ్డి, బాబు రెడ్డిని గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు కోరారు. సత్యగంగమ్మ ఆలయం వద్ద పట్టణ అధ్యక్షుడు గిరిధర్ గుప్త అధ్యక్షతన శనివారం సమావేశం జరిగింది.

పేర్నాటికి మద్దతుగా నిలవండి


చిన్నారిదొడ్డిలో పట్టభద్రుడిని ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


ఇరికిపెంటలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుప్పం/కుప్పం రూరల్: వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందామని కుప్పం మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ తెలిపారు. శుక్ర, శని వారాల్లో రాత్రి పట్టణంలోని 16వ వార్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాధికుడు, మంచి వ్యక్తి అయిన శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకోవడం ద్వారా పట్టభద్రుల సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేయాలని కోరారు.

శాంతిపురంలో..

శాంతిపురం: మండలంలోని దండికుప్పం, కొలమడుగు, శివరామపురం పంచాయతీల్లో శనివారం రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. అలాగే జెడ్పీటీసీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రేగడదిన్నేపల్లి, సొన్నేగానిపల్లి పంచాయతీల్లో, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి ఆధ్వర్యంలో నడింపల్లి, తుమ్మిశి, చిన్నారిదొడ్డి పంచాయతీల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.


కుప్పం: 16వ వార్డులో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ డా. సుధీర్

సదుంలో..

సదుం: పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు మండలంలోని సదుం, బూరగమంద, రెడ్డివారిపల్లె, పాపిరెడ్డిగారిపల్లె తదితర చోట్ల ప్రచారం చేశారు. సర్పంచ్‌లు ఉషారాణి, హనుమంతరెడ్డి, వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, నాయకులు వెంకటరెడ్డి, చిన్నరమణ, షబ్బీర్, ఈశ్వరరెడ్డి, గణేష్‌రెడ్డి, ఎల్లారెడ్డి, వినోద్, రాజ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సోమలలో..

సోమల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించాలని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఇరికిపెంట పంచాయతీలో స్థానిక ప్రజాప్రతినిధులతో పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును శ్యాంప్రసాద్‌రెడ్డికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర, సచివాలయ మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఎంపీటీసీ సభ్యుడు వేముల హరినాథ్, సర్పంచ్ రెడ్డెప్ప, గ్రామ సచివాలయ కన్వీనర్ ప్రదీప్, నేతలు పాల్గొన్నారు.

నేటి నుంచి కూర్మ వరదరాజుని బ్రహ్మోత్సవాలు



కూర్మ వరదరాజస్వామి ఆలయం, (ఇన్‌సెట్) స్వామివారు

- నేడు ధ్వజారోహణం, కల్యాణోత్సవం రేపు
- మార్చి 9వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాలు

పలమనేరు: పలమనేరు ప్రాంతంలోని పురాతన ఆలయాల్లో ఒకటైన కూర్మాయి శ్రీ కూర్మవరదరాజ స్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. మండలంలోని కూర్మాయి గ్రామ సమీపాన కౌండిన్య నది ఒడ్డున ఉన్న ఆలయంలో ఇప్పటికే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం స్వామివారి కల్యాణోత్సవం, మంగళవారం మడుగుతేరు, బ్రహ్మరథోత్సవం, బుధవారం పుష్పపల్లకి, గురువారం వసంతోత్సవం జరుగుతుందని ఆలయ ధర్మకర్త వెంకటరామారెడ్డి తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద రామకోటి, హరికథలు, పౌరాణిక నాటకాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఇదో పురాతనమైన ఆలయం..

ఈ ప్రాంతంలోనే ఇది పురాతన ఆలయం. ఈ ఆలయం పేరుతోనే నేటి కూర్మాయి అనే గ్రామం వెలసి ఉండడం విశేషం. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో శ్రీలక్ష్మీ సమేత వరదరాజస్వామి ఆలయాన్ని, ఎదురుగా విఘ్నేశ్వరుని ఆలయం సహా ఢంకణాచార్యులు అనే శిల్పి ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఆలయ మహాద్వారం నుంచి గర్భగుడిలోకి వెళ్లాక అక్కడ కింద ఓ రహస్య నేలమాలిగను అప్పట్లో నిర్మించారు. ఇక్కడ పెళ్లి చేసుకుంటే మగ బిడ్డలనే కంటారనే ప్రతీతి ఇప్పటికీ ఉంది. ఈ బ్రహ్మోత్సవాలకు స్థానికులే కాక, పొరుగు రాష్ట్రాలనుంచి సైతం భక్తులు వస్తుంటారు.

అందరి సహకారంతో మండలాభివృద్ధి


సదుం: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి

సదుం: అందరి సహకారంతో అభివృద్ధిలో మండలాన్ని ఆదర్శవంతంగా నిలపడమే లక్ష్యమని ఎంపీపీ ఎల్లప్ప, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జరిగింది. పలు శాఖల పరిధిలో సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టి సారించాలని చెప్పారు. పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు నెలకొన్నాయని పరిష్కరించాని కోరారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం పంపిణీపై ఫిర్యాదులు అందుతున్నాయని, వాటిని సరి చేయాలని కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అలాగే పక్కా గృహనిర్మాణాల పూర్తికి స్థానిక ప్రజాప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని తెలిపారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు త్వరలోనే మంజూరు కానున్నట్టు చెప్పారు. ఏనుగుల దాడులను పరిష్కరించేందుకు మంత్రి చొరవతో 10 మంది ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను నియమించినట్టు ఎఫ్‌బీఓ మహేష్ తెలిపారు. ఇప్పటివరకు ఏనుగుల దాడుల్లో సుమారు రూ.80 వేల వరకు పంట నష్టం జరిగినట్టు అంచనా వేశామని, ఆ మొత్తాన్ని త్వరలోనే పంపిణీ చేస్తామని చెప్పారు. సదుం నుంచి రెడ్డివారిపల్లె మీదుగా మదనపల్లెకు బస్సు సర్వీసు నడపాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి పీఏ మురళీకృష్ణారెడ్డి, ఎంపీడీఓ వరప్రసాద్, వైస్ ఎంపీపీలు ధనుంజయ రెడ్డి, అమరావతి, సింగిల్‌విండో చైర్మన్ శివారెడ్డి, కోఆప్షన్ మెంబరు ఇమ్రాన్ పాల్గొన్నారు.

దామోదరరాజు సేవలు ఎనలేనివి


దామోదరరాజుకు కేక్ తినిపిస్తున్న పెద్దిరెడ్డి, పార్టీ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, ఇతర నేతలు

చౌడేపల్లి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.దామోదరరాజు సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పార్టీ నియోజకవర్గపు పరిశీలకులు జింకా వెంకటాచలపతి అన్నారు. శుక్రవారం దామోదరరాజు జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పార్టీ నేతలతో కలిసి పంజాణివారిపల్లెలోని దామోదరరాజు స్వగృహంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి జన్మదిన శుభాకాంక్షలు జరుపుకున్నారు. అనంతరం పెద్దిరెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధిలో దామోదరరాజు కృషి ఎనలేనిదని కొనియాడారు. అనంతరం దామోదరరాజు మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సహకారంతో మండల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, మాజీ ఎంపీపీలు అంజిబాబు, వెంకటరెడ్డి, రుక్మిణమ్మ, ఎంపీటీసీ శ్రీరాములు, నాగరత్న, అపర్ణ, గంగులమ్మ, మాజీ ఎంపీటీసీలు పద్మనాభరెడ్డి, రమేష్‌బాబు, సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, వరుణ్‌భరత్, షంషీర్‌బాషా, కదిరప్ప, రఘునాథ రెడ్డి, విజయకుమారి, సోని, రిజ్వానా, భాగ్యవతి, లక్ష్మీదేవమ్మ తదితరులు ఉన్నారు.

ఘర్షణలో ఒకరిపై కత్తితో దాడి


గాయపడిన ఆనందస్వామి

గంగవరం : మండలంలోని కీలపల్లెలో శనివారం ఇరువర్గాల మధ్య వివాదం ఘర్షణకు దారి తీసింది. ఆగ్రహం పట్టలేని మహబూబ్‌బాషా (కై ఫ్) అనే వ్యక్తి ఆనంద స్వామి(47)పై కత్తితో దాడి చేశాడు. వివరాలు.. సంఘమిత్ర ఈశ్వరమ్మను నాలుగు నెలల క్రితం వెలుగు అధికారులు తొలగించారు. ఇప్పటికీ మరో సంఘ మిత్రను నియమించలేదు. దీనిపై గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఈశ్వరమ్మను కొనసాగించాలని ఓ వర్గం, వద్దంటూ మరో వర్గం భీష్మించుకున్నారు. చివరకు ఇరువర్గాలు ఘర్షణకు దిగడంతో మహబూబ్‌భాష ఒక్కసారిగా కత్తి తీసుకుని ఆనందస్వామిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. స్థానికులు గాయపడిన వ్యక్తిని హుటాహుటిన పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. దాడికి పాల్పడిన నిందితుడు పోలీసులకు లొంగిపోయాడు. ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలంపాటతో రూ.8.85 లక్షల ఆదాయం


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: వేలంపాట ద్వారా రొంపిచెర్ల గ్రామ పంచాయతీకి రూ.8.85 లక్షల ఆదాయం వచ్చిందని సర్పంచ్ ఇబ్రహీంఖాన్ అన్నారు. శనివారం రొంపిచెర్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. వారపు సంత నిర్వహణకు రూ.6.11 లక్షలు, దినసరి మార్కెట్‌కు రూ.1.40 లక్షలు, ప్రైవేటు బస్టాండ్‌కు రూ.1.35 లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. గతేడాది వేలంపాటలో రూ.8.62 లక్షల ఆదాయం రాగా ఈ ఏడాది రూ.8.85 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. గతంతో పోల్చితే ఈ ఏడాది రూ.23,500 వేలు ఆదాయం పెరిగిందన్నారు. వేలం పాటదారులు గ్రామ పంచాయతీ నిర్ణయించిన ధరలనే వసూలు చేయాలన్నారు. వచ్చిన ఆదాయంతో గ్రామ పంచాయతీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. వేలంలో ఎంపీడీఓ రాజేంద్ర, కార్యదర్శులు నాగరాజ, రవిచంద్రబాబు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి


రికార్డులు పరిశీలిస్తున్న వైస్ ఎంపీపీ ప్రభాకర, అమాస మోహన్

సోమల: మండలంలోని సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని వైస్ ఎంపీపీ ప్రభాకర అన్నారు. శనివారం ఇరికిపెంట సచివాలయాన్ని ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావుతో కలిసి తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులతో పాటు సిబ్బంది హాజరు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పక పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, ఎంపీటీసీ వేముల హరినాథ్, సర్పంచ్ రెడ్డప్ప పాల్గొన్నారు.